# అదృశ్య రేఖ... గుట్టు వీడింది!

**ప్రకృతి వింతలకు నిలయం. ఏ వాతావరణాన్ని తట్టుకునే జంతువులు అక్కడ నివసిస్తాయి. ఓ చోట అడవులు ఉంటే, మరో చోట ఎడారులు ఉంటాయి. పెంగ్విన్లు ఓ ధృవంలో, ధృవపు ఎలుగు బంట్లు మరో అంచులో ఉంటాయి. ఇలా ఏ ప్రాంతపు జీవ జాతుల్ని అక్కడ చూస్తుంటాం. కానీ, ఇందుకు భిన్నంగా పక్కపక్కనే ఉండే రెండు దీవుల్లో విభిన్న ప్రాంతాలకు చెందిన జీవులు ఉంటే అది వింతే. అలాంటి వింతే ఇండోనేషియాలో చూడొచ్చు. అయితే ఇక్కడి ఒక దీవిలోని జీవి మరో దీవిలోకి అడుగుపెట్టకుండా ఓ అదృశ్య రేఖ అడ్డుకుంటున్నదట. దీని గుట్టు ఈ మధ్యే వీడింది...**



ఇండోనేషియా... భూమ్మీద అతిపెద్ద ద్వీప సముదాయం. భౌగోళికంగా ఆసియా ఖండంలో ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే... ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల సంధి ప్రదేశం. కాబట్టి, ఇక్కడి దీవుల్లో కనిపించే జీవజాతుల్లో రెండు ఖండాలకు చెందినవీ ఉంటాయి. అయితే అవన్నీ కలివిడిగా ఉండవు, విడివిడిగా ఉంటాయి. పక్కపక్కనే ఉన్నా.. కొన్ని దీవుల్లో ఉన్నవి మరికొన్ని దీవుల్లో కనిపించవు. ఇదేం మిస్టరీ... అని అప్పట్లో ఈ ప్రాంతాన్ని దర్శించిన ఎందరో అనుకునేవారట. 160 ఏండ్ల క్రితం ఈ సుందరమైన దీవుల్ని బ్రిటన్‌కు చెందిన శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ సందర్శించారు. జీవజాతులు, వాటి వైరుధ్యాలను ఆయన అధ్యయనం చేసేవారు. ఇండోనేషియాలో పర్యటిస్తున్న సమయంలో ఆయనా ఈ విషయాన్ని గమనించారు. అంతటితో ఆగకుండా, పక్కపక్కనే ఉన్న ఏయే దీవుల్లో ఒకే రకమైన జీవులున్నాయి... ఏయే దీవుల్లో లేవు.. అన్నదీ గుర్తించారు. అన్ని దీవులూ తిరిగాక, ఇక్కడి దీవుల మధ్య జీవజాతులు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు సంచరించలేని విధంగా ఒక అదృశ్య రేఖ ఏదో ఉందని కనిపెట్టారు. దీన్ని ఆయన ప్రతిపాదించడంతో ఆ రేఖకు 'వాలెస్ రేఖ' అనే పేరు పెట్టారు.

### ఎక్కడుందీ రేఖ?

బోర్నియో, బాలి, జావా, సుమత్రా ద్వీపాలకూ.. పక్కనే ఉండే సులవేసి, లాంబోక్‌లాంటి ద్వీపాలకూ మధ్య ఈ రేఖను ప్రతిపాదించారు. నిజానికి బాలి–లాంబోక్ మధ్య దూరం దాదాపు 35 కిలోమీటర్లు మాత్రమే. అయితే రేఖకు ఇటువైపు ఉండే దీవుల్లో అంటే... బాలి తదితర దీవుల్లో ఆగ్నేయ ఆసియాలో కనిపించే ఆసియా ఏనుగులు, నీటి దున్నలు,



పులులు, ఖడ్గమృగాలు, ఒరాంగుటాన్లు, ప్రొబోసిస్ కోతులు, గిబ్బన్లు నివసిస్తాయి. కానీ, పశ్చిమాన ఉన్న సులవేసి, లాంబోక్‌లలో మాత్రం ఎక్కడో దూరంగా ఉన్న ఆస్ట్రేలియాకే ప్రత్యేకమైన ట్రీ కంగారూలు, కోలాలు, కొమొడో డ్రాగన్‌లలాంటి జీవజాతులు కనిపిస్తాయి. పక్షుల్లోనూ ఎల్లో హెడెడ్ వీవర్, కాపర్‌స్మిత్ బార్బెట్, జపనీస్ ట్రీ టోడ్ ఉడ్‌పెక్కర్... లాంటివి జావా, బాలీల్లో విరివిరిగా తిరుగుతుంటాయి. కానీ పక్కనే ఉన్న సులవేసి, లాంబోక్‌లో ఇవి కనిపించవు. అక్కడ ఆస్ట్రేలియా ప్రాంతానికి చెందిన కాకటూ, నార్తెన్ కాసోవరిలాంటివి దర్శనమిస్తాయి. నిజానికి పక్కపక్కనే దీవులు ఉన్నప్పుడు ఏండ్లు గడుస్తున్న కొద్దీ జీవజాలం కలిసిపోవాలి. కానీ ఇక్కడ అలా జరగలేదు.

### మిస్టరీ ఇదీ...

ఇలా ఎందుకు జరుగుతున్నదన్న దాని మీద ఇటీవల శాస్త్రవేత్తలు కొన్ని సమంజసమైన ప్రతిపాదనలు చేశారు. ఇప్పటి దాకా ఊహాజనితమే అనుకున్న వాలెస్ లైన్‌కు ఒకరకంగా భౌగోళిక పరమైన అస్థిత్వం కూడా ఉందని తేల్చారు. దాని ప్రకారం... మిలియన్ల సంవత్సరాల కిందట ఖండాలు ఏర్పడే సమయంలో... ప్రస్తుత ఆసియా ఖండాన్ని, ఆస్ట్రేలియా ఖండం వచ్చి ఢీకొంది. కొంత కాలానికి అది మళ్లీ విడివడి దూరంగా జరిగిపోయింది. ఈ ఘర్షణ కారణంగానే అగ్నిపర్వతాలు అధికంగా ఉండే ఇండోనేషియాతో పాటు చుట్టు పక్కల ఉండే పపువా న్యూ గినియాలాంటి మరికొన్ని ద్వీపదేశాలూ ఏర్పడ్డాయి. ఆ సమయంలోనే ఈ ద్వీపాలు కొన్నిటిలో ఆసియా, మరికొన్నిట్లో ఆస్ట్రేలియా జీవజాతులు వచ్చి చేరాయి. అవి అక్కడే ఉండిపోవడానికి బలమైన కారణం ఉంది. ఇలా ద్వీపాలు ఏర్పడినప్పుడు.. భూమిలోపల పెద్ద అగాధం ఏర్పడింది. అక్కడి టెక్టానిక్ ప్లేట్ల మధ్యలో ఉండే సందులో నుంచి నిత్యం లావా పెల్లుబుకుతూ ఉంటుంది. ఇది అక్కడి సముద్ర జలాలను మరిగేలా చేస్తున్నది. వేడి, చల్లటి నీళ్లు కలవడం వల్ల డీప్ సీ కరెంట్స్... తీవ్ర వేగవంతమైన ప్రవాహాలు ఏర్పడతాయి. దీంతో చేపలు సహా మరే ఇతర జీవులూ ఈ ప్రాంతాన్ని దాటి ఈదలేవు. అసలు ఈదే అవకాశమూ లేదు. ఇలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్న దారి అంతా ఈ వాలెస్ లైన్ అన్నమాట. ఇక, అక్కడి పక్షులు వలస వెళ్లే జాతులు కాకపోవడమే... పక్షి జాతుల్లోనూ వైరుధ్యం ఉండటానికి కారణం. అదన్నమాట సంగతి!! మొత్తానికి వాలెస్ లైన్... ఓ ప్రకృతి వింత!!